# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 31-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.
- ❖ ఏప్రిల్ 19న కత్రా నుంచి కశ్మీర్ కు తొలి వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు.
- ❖ గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత అంకుర సంస్థలు, సొంత సంస్థలతో ముందుకు రావాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.
- ❖ ఉత్తరాఖండ్ లోని గంగోత్రి ధామ్ మహాద్వారాలు ఏప్రిల్ 30న తెరుచుకోనున్నాయి.

=========================

ఈద్-ఉల్-ఫితర్ ఈరోజు దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. రంజాన్ ఉపవాస మాసం ముగింపు సందర్భంగా ఈ పండుగ జరుపుకుంటారు. దేశ వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఈద్గాలు, మసీదులలో ఈద్ ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలోని జామా మసీదు, ఫతేపురి మసీదు, షాహీ ఈద్గాలో ప్రధాన ఈద్ ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ఈద్-ఉల్-ఫితర్ ఉపవాస దీక్షలు, ప్రార్థనల ముగింపును సూచిస్తుందని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. సోదరభావం, సహకారం, కరుణ స్ఫూర్తిని ఈ పండుగ బలపరుస్తుందని రాష్ట్రపతి అన్నారు. సాంస్కృతిక వైవిధ్యం, వ్యక్తులను ఏకం చేసే ఉమ్మడి బంధాలకు ఈద్ గుర్తు చేస్తుందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ఖర్ పేర్కొన్నారు.

=========================

గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత అంకుర సంస్థలు, సొంత సంస్థలతో ముందుకు రావాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ రోజు హైదరాబాద్ లో వికసిత్ భారత్ వ్యవస్థాపకుల నెట్ వర్క్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ... 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి

చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్రప్రభుత్వం యువతను సొంత సంస్థలు, అంకుర సంస్థలు పెట్టుకునేలా ప్రోత్సహిస్తోందన్నారు. వికసిత్ భారత్ వ్యవస్థాపకుల నెట్ వర్క్ వంటి సంస్థలు యువతకు తమ సొంత సంస్థలను ప్రారంభించడానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు, శిక్షణ, అవగాహన కల్పిస్తున్నాయని కిషన్ రెడ్డి పేర్కొంటూ…

(వాయిస్ 24 సెకన్లు)

=========================

ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతంలో భారీ మాదక ద్రవ్యాల గుట్టు రట్టు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ రోజు సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో-ఎన్సీబీ, ఢిల్లీ పోలీసులు ఈ ముఠాను పట్టుకుని 27 కోట్ల రూపాయల విలువైన మెథాంఫేటమిన్, ఎండీఎంఏ, కొకైన్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ బృందం ఐదుగురిని అరెస్టు చేసింది. ఈ భారీ పురోగతి సాధించిన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ను, ఢిల్లీ పోలీసులను అమిత్ షా అభినందించారు. కేంద్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల వ్యాపారంపై ప్రభుత్వం అలుపెరగని వేట కొనసాగిస్తోందని ఆయన అన్నారు.

=========================

నీతి ఆయోగ్, నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లైడ్ ఎకనామిక్ రిసెర్చ్ - స్టేట్స్ ఎకనామిక్ ఫోరం పోర్టల్ ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రేపు ఢిల్లీలో ప్రారంభించనున్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ సహకారంతో నీతి ఆయోగ్ 1990-91 నుంచి 2022-23 వరకు సుమారు 30 సంవత్సర కాలానికి సామాజిక, ఆర్థిక, ఆర్థిక పారామీటర్లు, పరిశోధన నివేదికలు, పత్రాలు, రాష్ట్ర ఆర్థిక అంశాలపై నిపుణుల వ్యాఖ్యానాలతో సమగ్రంగా ఈ పోర్టల్ ను రూపొందించింది. ఈ పోర్టల్ స్థూల, ఆర్థిక, జనాభా, సామాజిక, ఆర్థిక ధోరణులను సులభంగా సమాచారాన్ని తెలుసుకోవడానికి, సులువుగా అర్థం చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది.

=========================

గ్రీస్ లో ఈ రోజు నుండి ప్రారంభం కానున్న బహుళజాతి వైమానిక విన్యాసం ఇనియోకోస్ -25లో భారత వైమానిక దళం (ఐఏఎఫ్ ) పాల్గొంటుంది. గ్రీస్ కు చెందిన హెలెనిక్ వైమానిక దళం ఆతిథ్యమిచ్చే ఈ 12 రోజుల విన్యాసాలు చారిత్రక ప్రాంతమైన ఎలిస్ లోని ఆండ్రవిడా ఎయిర్ బేస్ లో జరగనున్నాయి. ఈ విన్యాసాలు ఏప్రిల్ 11వ తేదీ వరకు కొనసాగుతాయి. ఐఏఎఫ్ బృందంలో ఎస్ యూ-30 ఎంకేఐ యుద్ధ విమానాలతో పాటు యుద్ధ సామర్థ్యం కలిగిన ఐఎల్ -78, సీ-17 విమానాలు ఉన్నాయి.

విరామం

=========================

మీడియా, ఎంటర్టైన్మెంట్ (ఎం అండ్ ఇ) రంగానికి ఒక మైలురాయిగా నిలిచే మొదటి ప్రపంచ ఆడియో విజువల్, ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ (వేవ్స్) 2025 మే 1 నుండి 4వ తేదీ వరకు మహారాష్ట్రలోని ముంబైలో భారత ప్రభుత్వం నిర్వహిస్తుంది. మీడియా, వినోద రంగానికి ప్రధాన ప్రపంచ ఇ-మార్కెట్ ప్రదేశమైన వేవ్స్ బజార్ ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగే ప్రారంభం శక్తివంతమైన ప్రభావాన్ని చూపనుంది. వేవ్స్ 2025 కీలక భాగంగా ఉన్న ఈ -మార్కెట్ ప్లేస్… ఫిల్మ్, టీవీ, యానిమేషన్, విఎఫ్ఎక్స్, గేమింగ్ కామిక్స్ రంగాలకు చెందిన పరిశ్రమ నాయకులను ఏకతాటిపైకి తీసుకోస్తూ… సహకారం, విషయ ప్రదర్శన, వ్యాపార విస్తరణకు అసమాన అవకాశాలను అందించనుంది. వేవ్స్ బజార్ కంటెంట్ సృష్టికర్తలు, కొనుగోలుదారులు, పెట్టుబడిదారులకు అత్యున్నత స్థాయిలో ఉపయోగపడనుంది.

=========================

ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా 272 కిలోమీటర్ల రైలు మార్గం పూర్తయిన సందర్భంగా ఏప్రిల్ 19న కత్రా నుంచి కశ్మీర్ కు తొలి వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించనున్నారు. ప్రధానమంత్రి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జిని సందర్శించి ప్రారంభిస్తారని, అనంతరం కత్రా నుంచి వందేభారత్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తారని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ జమ్మూలో ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ చెప్పారు. జమ్మూ స్టేషన్ పునరుద్ధరణలో ఉన్నందున ఈ సర్వీసు మొదట కత్రా నుండి నడుస్తుంది. ఈ రైలు జమ్మూ- శ్రీనగర్ మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని, ఈ ప్రాంతానికి అనుసంధానత మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు.

==========================

ఉత్తరాఖండ్ లోని గంగోత్రి ధామ్ మహాద్వారాలు ఏప్రిల్ 30న తెరుచుకోనున్నాయి. గంగా మాత శీతాకాల నివాసమైన ముఖ్వాలో జరిగిన సమావేశంలో శ్రీ గంగోత్రి ఆలయ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అదే రోజు యమునోత్రి ధామ్ తలుపులు కూడా తెరుచుకుంటాయి. రోహిణి నక్షత్రంలో అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ 30న ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ఉత్తరకాశీలో ఉన్న గంగోత్రి ధామ్ మహాద్వారాలు భక్తుల కోసం తెరుచుకోనున్నాయి. దీంతో రాష్ట్రంలో చార్ ధామ్ యాత్ర ప్రారంభం కానుంది. హిందూ నూతన సంవత్సరం, చైత్ర శుక్ల ప్రతిపాద నవరాత్రుల మొదటి రోజైన ఆదివారం గంగోత్రి ధామ్ తలుపులు తెరిచేందుకు మంచి సమయాన్ని నిర్ణయించినట్లు గంగోత్రి ఆలయ కమిటీ కార్యదర్శి సురేష్ సెమ్వాల్ తెలిపారు. కాగా అక్షయ తృతీయ సందర్భంగా భక్తుల కోసం యమునోత్రి ధామ్ తలుపులు కూడా తెరుచుకోనున్నాయి. ఇదిలా ఉండగా మే 2వ తేదీన కేదార్ నాథ్ ద్వారాలు, మే 4న బద్రీనాథ్ ధామ్ ద్వారాలు తెరుచుకోనున్నాయి.

==========================

మయన్మార్ లోని 'ఉష్ఖ్ థీన్' మఠంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం సహాయక చర్యలు ప్రారంభించిందని, అక్కడ ఇంకా 170 మంది సన్యాసులు చిక్కుకుపోయారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ రోజు తెలిపింది. ఆర్మీ బృందం ఈ రోజు ఆసుపత్రి స్థలాన్ని సందర్శిస్తుందని, రేపు వారి వైద్య సేవలను ఏర్పాటు చేస్తుందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. భూకంప ప్రభావిత మయన్మార్ లో ఆపరేషన్ బ్రహ్మలో భాగంగా 11 అంతస్తుల 4 టవర్లు కూలిపోయిన స్కై విల్లా వద్ద ఎన్డీఆర్ ఎఫ్ బృందాన్ని మోహరించేందుకు విదేశాంగ శాఖ ప్రయత్నిస్తోంది. భారతీయ సమాజ సభ్యుల బస, ఆహారం కోసం భారతదేశం సహాయం అందిస్తోందని మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

==========================

గత శుక్రవారం మయన్మార్ లో సంభవించిన భూకంప మృతుల సంఖ్య 2 వేలు దాటింది. 7.7 తీవ్రతతో భారీ భూకంపం సంభవించగా, ఆ తర్వాత నిమిషాల వ్యవధిలోనే 6.4 తీవ్రతతో భూకంపం సంభవించడంతో పలు దేశాల్లో భారీ ప్రాణనష్టం సంభవించింది. థాయ్ లాండ్, వియత్నాం, లావోస్, నైరుతి చైనాలో బలమైన ప్రకంపనలు సంభవించాయి. ఈ భూకంప ప్రభావంతో ఇప్పటివరకు 2 వేల 056 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, 3 వేల 900 మందికి పైగా గాయపడ్డారని, ఇంకా 270 మంది గల్లంతయ్యారని మయన్మార్ సైనిక నాయకత్వం తెలిపింది.

==========================

==========================